# రాజుగారి తలనొప్పి

రాజుగారికి తలనొప్పి వచ్చింది. రాజవైద్యులు వచ్చి ఉత్తమమయిన శాస్త్రగ్రంథాలు పరిశీలించి అది శిరోవేదన అయివుంటుందని నిర్ణయించారు.

అందువల్ల రాజుగారి తలనొప్పి తగ్గలేదు. హెచ్చింది. దానికేదైనా మందు చూడండి అన్నాడు రాజుగారు.

రాజవైద్యులు ఎన్నో చికిత్సరు చేశారు. లాభం లేకపోయింది.

ఆఖరుకు రాజవైద్యులు దినపత్రికలు తెప్పించి అందులో ప్రకటించబడిన ఒక అమోఘమైన తలనొప్పి మందు చూసి అది తెచ్చి రాజుగారికిచ్చారు.

ఏ విధమైన కారణం చేత కలిగిన శిరోవేదన అయినా ఆ మందు వల్ల కుదురుతుందని ఆ పత్రికలలో గ్యారంటీ ఇవ్వబడి ఉంది.

రాజుగారు ఆ మందు వేసుకోగానే అయిదు నిమిషాల్లోపల చాలా వింతలు జరిగినై.

రాణిగారు రాజుగారిని సాధించటం మానుకుంది.

మంత్రిగారు అడ్డమైన కాగితాలు రాజుగారి బల్లమీదినించి తీసి చించి ముక్కలు ముక్కలు చేసి కిటికీలోనుంచి బయటకు పారేసి ఆరునెల్లు సెలువు కోరి ఇంటికి వెళ్లిపోయినాడు.

అధికారుల అత్యాచారాలను గురించీ, తమ తమ ప్రాంతాలలో కలిగిన అతివృష్టి, అనావృష్టి దోషాలను గురించీ మొరబెట్టుకోవటానికి వచ్చిన ప్రజలు తమ అభిప్రాయం మార్చుకుని తమ కష్టాలకు తల ఒగ్గటానికి నిర్ణయించుకున్న వాళ్లయి తిరిగి వెళ్లిపోయినారు.

రాజుగారికి విషం పెట్టటానికి ఇరవై ఎనిమిదోసారి ప్రయత్నం చేస్తున్న ఉంపుడుకత్తెలు తమ ప్రయత్నం మానుకుని ఆ విషం కాస్తా రాణీగారి చేత తాగించారు.

పక్కదేశపు రాజు, తాను యుద్ధం చేయకుండానే మన రాజుగారికి లొంగి పోదలచినట్టు వార్త పంపించాడు.

రాజుగారి తలనొప్పి అయిదు నిమిషాలలో సర్దుకుంది.

"పత్రికల్లో ప్రకటనల్లో ఏ మాత్రమూ సత్యం ఉండదనటానికి వీల్లేదు" అన్నారు రాజవైద్యులు.

***ముద్రణ : చిత్రగుప్త, 15 ఏప్రిల్ 1945***